క్లుప్తంగా

తిమ్మాపురంలో నేడు ఉచిత వైద్యశిబిరం


బంగారయ్య

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు తిమ్మాపురం గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు కేజీహెచ్ మాజీ ఆర్ఎంవో, బీబీ చారిటబుల్ వ్యవస్థాపకుడు డాక్టర్ బంగారయ్య తెలిపారు. స్థానిక చేపల మార్కెట్‌కి ఎదుగా ఉన్న బంగారయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రదేశంలో ఉదయం 9 గంటల నుంచి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ శిబిరానికి అన్నిరకాల ప్రత్యేక వైద్యులు హాజరవుతారన్నారు. గుండె, కిడ్నీ, చెవి, ముక్కు, దీర్ఘకాలిక సుగర్, బీపీ, ఈసీజీ, ఇతర అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలందిస్తున్నట్టు చెప్పారు. వైద్య నిపుణులతో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరాలు స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన


మునగపాక జెడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న నోడల్ అధికారి

మునగపాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాన్ని శనివారం నోడల్ అధికారి నాగభూషణం పరిశీలించారు. అక్కడి సదుపాయాలపై ఆరా తీశారు. ఎన్నిక ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు కృషి చేయాలని, పోలింగ్ ఏర్పాట్లను పక్కాగా చూసుకోవాలని సూచనలు చేశారు. ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, వీఆర్వో హిమబిందు ఆయన వెంట పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించకపోతే స్థలాలు రద్దు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నక్కపల్లి: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన వారంతా త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. శనివారం చినదొడ్డిగల్లులో జగనన్న కాలనీని సందర్శించారు. కొంతమంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోవడంతో వారందరినీ పిలిచి మాట్లాడారు. నిర్మాణాలు ప్రారంభించకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని, నిర్మాణాలు ప్రారంభించాలని ఆదేశించారు. స్థలాలు పొంది ఇళ్లు నిర్మించకపోతే రద్దు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఈయన వెంట ఈవోపీఆర్డీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

సచివాలయాల నిర్మాణం వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి మంజులావాణి

మునగపాక: ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి మంజులావాణి కోరారు. మండల పరిషత్ హాలులో శనివారం మండల అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. అలాగే జగనన్న ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఎంపీడీవో రవికుమార్, మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పంట నమోదుతో లాభాలెన్నో..

- చురుగ్గా పంటల సాగు వివరాల సేకరణ
- నియోజకవర్గంలో 8083 ఎకరాల్లో ఈ- పంట నమోదు

మునగపాక : ఆరుగాలం శ్రమించే రైతులకు నిరంతరం కష్టాలే మిగులుతున్నాయి. విత్తనం నాటిన నుంచి పంట చేతికి అందివచ్చే వరకు రైతుకు ఎటువంటి భరోసా ఉండదు. అతివృష్టి, అనావృష్టి బారిన పడుతూనే ఉంటారు. రైతులు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం పొందేందుకు రైతులు నానా అవస్థలు పడుతునే ఉంటారు. వీరి కష్టాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ-పంట నమోదును అందుబాటులోకి తీసుకువచ్చింది.పంట పరిహారం పొందాలన్నా,ఇతర పథకాలకు అర్హత సాధించాలన్నా రైతు తను పండించే పంటను ఈ-పంటలో నమోదు చేయించాల్సిందే. రబీలో ఇప్పటికే ఈ-పంట నమోదు చురుగ్గా సాగుతుంది.

వలంటీర్ల ద్వారా వివరాల సేకరణ

ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా వలంటీర్ల ద్వారా రైతుల నుంచి ఏఏ పంటలు సాగు చేస్తున్నారనే వివరాలకు సంబంధించి కార్యక్రమాలు చేపట్టారు. పస్‌బీ, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఏఏ పంటలు ఏఏ సర్వే నంబర్లలో సాగు చేస్తున్నారనే వివరాలతో కూడిన ఫొటోను ఈ-పంట నమోదులో భాగంగా అప్‌లోడ్ చేస్తున్నారు. గ్రామస్థాయిలో వీఆర్వో, వ్యవసాయ అనుబంధ రంగాల సహాయకులు, గ్రామ సర్వేయర్లకు సంబంధిత బాధ్యతలు అప్పగించారు. మండల స్థాయిలో తహసీల్దార్, వ్యవసాయాధికారి సంబంధిత నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

లాభాలివీ..

ఈ-పంట నమోదు ద్వారా రైతులకు పలు రకాల లాభాలు అందనున్నాయి. పంటల పెట్టుబడికి ఉపయోగపడే రైతు భరోసా, సున్నా వడ్డీ రుణాలు, కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల నష్ట పరిహారం తదితర సంక్షేమ పథకాలకు ఈ-పంట నమోదు ద్వారా అమలు చేస్తారు. ఈ-పంట నమోదు చేసుకోలేని రైతులకు ఎటువంటి సాయం అందకుండా పోతుంది.

8083 ఎకరాలకు నమోదు

నియోజకవర్గం వ్యాప్తంగా రబీసీజన్‌కు సంబంధించి ఇంతవరకు 17815 ఎకరాలకు 8083 ఎకరాల్లో ఈ-పంట నమోదు జరిగింది. ఈ నెల 28లోగా పూర్తిస్థాయిలో ఈ-పంట నమోదు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు. రైతుల కమతాల వద్దకు వెళ్లి ఈ-పంట నమోదు చేయించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. మునగపాక మండలంలోని 3128 ఎకరాలకు గాను 1356 ఎకరాల్లో నమోదు పూర్తయింది. అచ్యుతాపురంలో 4524 ఎకరాలకు గాను 2342 ఎకరాలు, రాంబిల్లిలో 5820 ఎకరాలకు గాను 3124 ఎకరాల్లోనూ, యలమంచిలిలో 2845 ఎకరాలకు గాను 1261 ఎకరాల్లో ఇంతవరకు ఈ-పంట నమోదు జరిగినట్టు అధికారులు తెలిపారు.


మునగపాకలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

రైతులకు అవగాహన



అధికారులు పొలాల వద్దకు వచ్చి ఈ-పంట నమోదు ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. పంటల వద్దకు వచ్చి ఏ పంట సాగు చేస్తున్నామనే విషయమై ఫొటో తీస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కలిగే మేలును వివరిస్తున్నారు. ఈ -పంట నమోదు చేసుకోవడం ద్వారా ఎరువులు, విత్తనాలు, రుణాలు సక్రమంగా అందుతాయని చెబుతున్నారు.

-బొడ్డేడ వెల్లయ్యనాయుడు, రైతు, మూలపేట

తప్పక నమోదు కావాలి



ఈ-పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు ఎంతో మేలు. కనీస మద్దతు ధర, సున్నా వడ్డీ రుణాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్ట పరిహారం అందుతుంది. రైతుల కమతాల వద్దకు వెళ్లి ఏఏ పంటలు వేస్తున్నారనే వివరాలతో కూడిన ఫొటోను అప్‌లోడ్ చేస్తున్నాం. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలి.

-జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

'సీతంరాజును భారీ మెజార్టీతో గెలిపించాలి'


దేవవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ కు మద్దతుగా పాయకరావుపేట నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శనివారం నక్కపల్లి మండలంలో దేవవరం, ఒడ్డిమెట్ట, గొడిచర్ల తదితర గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులను కలసి ఓటు అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలపరచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఉత్తరాంధ్రతోపాటు, పాయకరావుపేట నియోజకవర్గ సమస్యలు శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కరించే సత్తా కలిగిన నాయకుడు సీతంరాజు సుధాకర్ అన్నారు. ఆయన సమర్థతను గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆయనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసారన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అవన్నీ పేదలందరికీ వర్తింపజేసిన జగనన్నకు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొర్ల నర్సింహమూర్తి, అల్లు రమణ, ఎంపీటీసీ లొడగల చంద్రరావు, స్థానిక నాయకులు నర్సింహమూర్తి, గొర్ల బాబూరావు, రమణ, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రావెల్, పునాది రాళ్ల కొరతపై హౌసింగ్ పీడీకి వినతి


పీఎల్ పురం జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ కూర్మినాయుడు

పాయకరావుపేట : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా చేపట్టాలని, అధికారులు లబ్ధిదారులను సమాయత్తం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ కూర్మినాయుడు అన్నారు. మండలంలో గల పీఎల్ పురం జగనన్న కాలనీలను ఆయన పరిశీలించారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు సిమ్మెంట్, ఇనుము, ఇసుక సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రావెల్, పునాదికి రాళ్ల సరఫరా సమస్యగా ఉందని జెడ్పీటీసీ లంక సూరిబాబు పీడీ కూర్మినాయుడు దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి మైనింగ్ అధికారులతో సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. లబ్ధిదారులకు చెల్లించే సామాగ్రి, నగదు చెల్లింపులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. డీఈ పి.విజేయుడు, ఏఈ ప్రతాప్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక : మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ వేగి లక్ష్మణరావు తెలిపారు. ఆలయాన్ని ప్రారంభించి మూడేళ్లు కావస్తున్న నేపథ్యంలో ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తుల సహకారంతో నిర్వహించే వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని లక్ష్మణరావు కోరారు.

బాల్య వివాహంపై కౌన్సెలింగ్ వాయిదా

మునగపాక : బాల్య వివాహాలు చేయడం చట్టారీత్యా నేరమంటూ ఒకవైపు చెబుతున్నా కొంతమంది గ్రామీణ ప్రాంత ప్రజలు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ప్రజల్లో మరింత అవగాహన కలిగించాల్సి ఉన్నా అమలుకు నోచుకోలేదు. మండలంలోని గణపర్తి గ్రామంలో మార్చి 8న మైనర్ బాలికకు వివాహం జరగనుంది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, పోలీసు, రెవెన్యూ, మండల పరిషత్ ఉద్యోగులు శుక్రవారం రాత్రి గ్రామానికి చేరుకొని కౌన్సెలింగ్ చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో వివాహం చేసుకునే జంట అందుబాటులో లేకపోవడంతో కౌన్సెలింగ్‌ను సోమవారానికి వాయిదా వేసినట్టు అధికారులు తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

మునగపాక : అచ్యుతాపురం మండలం హరిపాలెం భగీరథమ్మ ఆలయం వద్ద ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని నిర్వాహకులు వేగి కృష్ణ, వెలగా రామకృష్ణ, దాడి కృష్ణ, రాజాన బుజ్జి సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1992-93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా ఈ సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

సర్వేలు సత్వరం పూర్తి చేయాలి

రాంబిల్లి: ప్రజలకు మెరుగైన సేవలందించాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు ఆదేశించారు. శనివారం ఆయన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఆయుష్మాన్‌భవ ఇతర సర్వేలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


కృష్ణంపాలెంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

రాంబిల్లి: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు కోరారు. శనివారం ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు ఇతర అధికారులతో కలిసి ఆయన కృష్ణంపాలెం, రాంబిల్లి లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు


అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ


కోటవురట్ల : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ హెచ్చరించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమై వివిధ పథకాల పురోగతిపై సమీక్ష చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందకపోతే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోని హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య పనులు


శ్మశాన వాటిక వద్ద శుభ్రపరిచిన దృశ్యం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పలు వీధుల్లో చెత్తను తొలగింపజేసి డ్రైనేజీలలో పూడికలు తీశారు. ప్రధానంగా శ్మశాన వాటిక వద్ద భారీగా చెత్త పేరుకుపోవడంతో పొక్లెయిన్‌తో తొలగింపజేసి ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చివేశారు.

సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణకు పోరాటం


అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న నేతలు

అనకాపల్లి రూరల్: ఎంతోచరిత్ర గల అనకాపల్లి వి.వి.రమణ సుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించుకోవాలని, ఇందుకు రాజకీయాలకతీతంగా పోరాటం సాగించాలని అఖిల పక్ష రాజకీయ ప్రజా రైతు సంఘ సమావేశం తీర్మానించింది. శనివారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ప్రజా వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేశ్‌బాబు అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అనకాపల్లి సుగర్స్‌ను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు దొరబాబు, కోనలక్ష్మణ్, సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, చెరకు రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు, దూలం గోపీ, మళ్ల శ్రీను, బొడ్డేడ అప్పారావు, బట్ట చిన్న యాదవ్, ఆళ్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్‌కు సత్కారం


బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్‌ను సత్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కోటవురట్ల: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన పైల రమేష్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ రమేష్‌ను శాలువాతో సత్కరించారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రమేష్‌కు సూచించారు. రమేష్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. అందరి సహకారంతో పార్టీ విజయానికి అన్నివేళలా కృషి చేస్తానన్నారు.

రహదారి విస్తరణకు సహకరించాలి


రహదారి విస్తరణ బాధితులతో మాట్లాడుతున్న అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ

మునగపాక : పూడిమడక రహదారి విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. బాధితులు కూడా సహకరించి ప్రభుత్వం అందించే పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని గంగాదేవిపేట పైడితల్లి అమ్మవారి ప్రాంగణంలో తోటాడ రెవెన్యూ పరిధిలో భూములు, గృహాలు కోల్పోతున్న బాధితులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు చోట్ల ఇప్పటికే బాధితులకు అందించే పరిహారం కొలిక్కి వచ్చిందన్నారు. తోటాడ రెవెన్యూ పరిధికి సంబంధించి వ్యవసాయేతర భూములకు గజం ఒక్కంటికి రూ.12,500 అలాగే వ్యవసాయ భూములకు రూ.8990 మేర పరిహారం అందిస్తామని చెప్పారు. పలువురు రైతులు వ్యవసాయేతర భూములకు రూ.18వేలు, వ్యవసాయ భూములకు రూ.9500 వంతున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆర్డీవో చిన్నికృష్ణ స్పందించి జిల్లా కలెక్టర్ పటానొశెట్టి, జేసీ కల్పనాకుమారిలు ప్రభుత్వంతో అన్ని రకాలుగా చర్చించి పరిహారం విషయమై నిర్ణయం తీసుకున్నామన్నారు. రైతులు కూడా సహకరించాలని కోరారు. ఎట్టకేలకు రైతులు ప్రభుత్వం అందించే పరిహారానికి అంగీకారం తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, ఆర్ఐ రమేష్, వీఆర్వో సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డపు శ్రీరామమూర్తి, పలువురు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఆధ్వర్యంలో హోమియో వైద్య శిబిరాలు


హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

యలమంచిలి : దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా దేవదాయ శాఖ అధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ అన్నారు. శనివారం ఆయన యలమంచిలి గుర్రప్ప కళ్యాణ మండపంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యలమంచిలిలో దేవదాయ శాఖకు చెందిన లోకల్ ఫండ్ సత్రం ఆర్థిక సహకారంతో ఈ ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారని, వారంలో ప్రతి శనివారం గుర్రప్ప కళ్యాణ మండపంలో ఈ వైద్య శిబిరం జరుగుతుందని అన్నారు. ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన దేవదాయశాఖ ఉన్నతాధికారులు కమిషనర్ హరిజవహర్‌లాల్, అదనపు కమిషనర్ చంద్రశేఖర్ అజాద్ వారి ఆదేశాలతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు, ఎంజెవి ప్రసాద్, దేవదాయశాఖ తనిఖీదారు వి.శ్రీనివాసరాజు, లోకల్‌ఫండ్ సత్రం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.సాంబశివరావు, నక్కపల్లి గ్రూప్ ఆఫీసర్ వి.వి.ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో సమస్యలుంటే తెలపండి


పీకే పల్లిలో లే అవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోటవురట్ల : ఇంటి నిర్మాణాల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ సూచించారు. మండలంలోని పీకే పల్లి, రామన్నపాలెం గ్రామాలలోని వైఎస్సార్ జగనన్న కాలనీలలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పురోగతి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకునే సదవకాశాన్ని కల్పిస్తోందన్నారు. బిల్లులు సకాలంలో మంజూరవుతున్నాయని, ఇంటి నిర్మాణాలకు సంబంధించి మెటీరియల్ కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ ఏఈ వర్మ పాల్గొన్నారు.

కుళాయిల ఏర్పాటులో అక్రమాలు సహించం


పశువుల పాకకు వేసిన కుళాయిని తొలగిస్తున్నట్టు చెబుతున్న సర్పంచ్ వెంకటరమణ

ఎస్.రాయవరం : జేజేఎల్ఎంలో కుళాయిల ఏర్పాటులో అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని పెదఉప్పలం సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ హెచ్చరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు జేజేఎల్ఎంలో గ్రామానికి రూ.59 లక్షలు కేటాయించారన్నారు. ప్రతి ఇంటికి కుళాయి వేసి, సురక్షితమైన తాగునీరు అందించే ప్రాజెక్టు జేజేఎల్ఎం అని చెప్పారు. అయితే సిబ్బంది చేతివాటం ప్రదర్శించి నివాసం లేని చోట కుళాయి కనెక్షన్ వేసినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. దానిని వెంటనే తొలగించామన్నారు. పార్టీలకతీతంగా గ్రామంలో అన్ని నివాసాలకు ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇస్తున్నామన్నారు. టీడీపీ వాళ్లు చేస్తున్న దుష్ప్రచారం ఆపాలన్నారు. పనులు పూర్తయ్యే సరికి గ్రామంలో 99 శాతం ఇంటింటికి కుళాయి ఏర్పాటు పూర్తవుతుందన్నారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు


జర్నలిస్టులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : అడ్డురోడ్డులో శనివారం మండలంలో ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏటికొప్పాక సుగర్‌ఫ్యాక్టరీ వైద్యనిపుణుడు పి.అనిల్‌వర్మ వారికి వైద్య తనిఖీలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ, రక్తంలో కొవ్వు శాతం నిర్ధారణ వంటి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సూచనలు చేశారు.

వర్సిటీ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

సబ్బవరం: వంగలిలో పెట్రోయూనివర్సిటీకి కేటాయించిన భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. గ్రావెల్ తరలిస్తూ పట్టుబడిన లారీని స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ సిబ్బందితో కలిసి శనివారం గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన భూములను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. వర్సిటీకి కేటాయించిన భూముల్లోని సుమారు 10 సెంట్ల స్థలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టినట్లు గుర్తించామన్నారు. అక్కడ నుంచి సుమారు 50 లారీల వరకు గ్రావెల్ అక్రమంగా తరలించినట్లు అంచనా వేశామన్నారు. శనివారం వేకువజామున వర్సిటీ స్థలంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టినట్లు స్థానికులు వర్సిటీ రిజిస్ట్రార్ మురళీకృష్ణకు సమాచారం అందించారన్నారు. దీంతో ఆయన జిల్లా కలెక్టర్‌తో పాటు సీఐ రంగనాథంకు విషయం తెలియజేశారని చెప్పారు. దీనితో ఆర్డీవో ఆదేశాల మేరకు క్షేత్ర పరిశీలన చేసినట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. పోలీసులు పట్టుకున్న లారీని మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. క్షేత్ర పరిశీలన చేసినవారిలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్,మండల సర్వేయర్ శ్రీనివాసరావు,ఆర్ఐ వీరయ్య, వీఆర్వో మూర్తి తదితరులు ఉన్నారు.